క్లుప్తంగా

సన్మానం


వృద్ధులను సన్మానిస్తున్న దృశ్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని రాయవరం గ్రామంలో ఆదివారం రోటరీ గ్లోబల్ చాంపియన్ ఆధ్వర్యంలో పాఠశాలలకు క్రీడా సామగ్రి, విద్యార్థులకు కనీస వసతులు అందించారు. కాగా కార్యక్రమానికి హాజరైన వారికి మర్యాదగా శాలువాలు కప్పి సన్మానించడం ఆనవాయితీ. కానీ ఇక్కడ మాత్రం భిన్నంగా గ్రామంలో 7 పదులు దాటి నేటికీ ఉపాధి హామీ పనుల్లో చురుకుగా పనులు చేస్తున్న మట్టిమనుషులు(గట్టి మనుషులు) లకు కూడా శాలువాలు కప్పి సన్మానించారు. దీంతో రోటరీ సభ్యులకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో ఇటీవల మృతి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు చిలుపూరి రాజిరెడ్డి, దామెర సత్తవ్వల కుటుంబ సభ్యులను ఆదివారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పరామర్శించారు. అదేవిధంగా గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఐ కార్యకర్తల కుటుంబాలను కలిసి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, నాయకులు బాలమల్లు వనేశ్, జనార్దన్, సారయ్య తదితరులు ఉన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి


మంత్రి దయాకర్‌రావుతో ఎంపీపీ లక్ష్మి, మండల సర్పంచ్‌లు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో సుమారు 21 గ్రామ పంచాయతీల్లో సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీపీ మాలోతు లక్ష్మిబీలునాయక్ నేతృత్వంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఆదివారం హన్మకొండలో సర్పంచ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాలోతు లక్ష్మి మాట్లాడుతూ.. ఒక్కొక్క గ్రామానికి రూ.5లక్షలు, మరికొన్ని గ్రామాలకు రూ.10లక్షల చొప్పున మొత్తం రూ.1.40కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే సతీశ్ కుమార్ ఆదేశాల మేరకు సర్పంచ్‌లతో మంత్రిని కలిశామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మాలోతు బీలునాయక్ పాల్గొన్నారు.

మిమిక్రీ కళాకారుడికి సన్మానం


రమేశ్‌ను సన్మానిస్తున్న యువ చైతన్య వెల్ఫేర్ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ హుస్నాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలు-2023 జాతీయ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేటకు చెందిన ప్రముఖ మిమిక్రీ, మేజిక్ కళాకారుడు రమేశ్‌ను నిర్వాహకులు కీర్తి కళా రత్న జాతీయ పురస్కారంతో ఘనంగా సన్మానించారు. వివిధ అంశాల్లో రాణించిన వారిని ఈ సందర్భంగా సన్మానించారు. సన్మానం అనంతరం రమేశ్ మాట్లాడుతూ.. దేశంలో కళలను గుర్తించినప్పుడే కళాకారులకు ఉత్సాహం లభిస్తుందన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ


యువతకు క్రికెట్ కిట్లు అందజేస్తున్న దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గంగాపూర్‌లో యువతకు మన్ కి బాత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పిట్ల పరశురాములు మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలని, దేశ భక్తి కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో దాత పన్యాల మహేందర్‌రెడ్డి, నాయకులు కిషన్‌గౌడ్, సాగర్, భరత్ రెడ్డి, ప్రశాంత్, రంజిత్, వెంకటేశ్, విజేందర్‌రెడ్డి, శేఖర్, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఆదివారం ఆస్పత్రికి సెలవు!

- ప్రతీ వారం పీహెచ్‌సీకి తాళం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఇష్టారీతిన వ్యవహరిస్తున్న సిబ్బంది



తాళం వేసి ఉన్న రామవరం పీహెచ్‌సీ

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంతో పాటు, రామవరం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆదివారం వచ్చిందంటే విధులకు హాజరు కాకుండా సెలవు పెడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికి నిదర్శనం పీహెచ్‌సీ సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో ఆదివారం రామవరం పీహెచ్‌సీకి తాళం వేసి ఉండడం. కొద్ది నెలలుగా పీహెచ్‌సీ నిర్వహణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడడంతో సిబ్బంది విధులకు గైర్హాజర్ అవుతున్నారని, సమయపాలన పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు, ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పీహెచ్‌సీలో సిబ్బంది అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. కానీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో సిబ్బంది గాడి తప్పుతున్న పరిస్థితి.

ఇష్టం వచ్చినట్లుగా..

సిబ్బంది సోమవారం నుంచి శనివారం వరకు వారికి ఇష్టం వచ్చినప్పుడు తీస్తూ ఎప్పుడు వెళ్తే అప్పుడే మూసి వేస్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం అసలు తీయడమే లేదని వాపోతున్నారు.

సమయపాలన నిల్..

అక్కన్నపేట, రామవరం పీహెచ్‌సీలలో కొందరు సిబ్బంది, వైద్యులు సైతం రోజూ వారీగా విధులకు హాజరుకావడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. హాజరైన వారు సైతం సమయపాలన పాటించడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారి స్పందించి పీహెచ్‌సీలో విధులకు గైర్హాజరవుతున్న వారితో పాటు సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకొని ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్యం అందేలా చూడాలని రోగులు కోరుతున్నారు. ఈ విషయంపై సాక్షి వైద్యాధికారిని వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

సామాజిక సేవలే గుర్తింపునిస్తాయి

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): నిరుపేదలకు చేసిన సామాజిక సేవలే సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌లో కోణార్క్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు అందించారు. కాగా ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందిండానికి ప్రైవేట్ ఆస్పత్రులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యాన్ని అందించడానికి ముందుకు వచ్చే ఆస్పత్రులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, సర్పంచ్ మమత, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ పంజాల కవిత, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ జిల్లా సభ్యుడు దుబ్బరాజం, అక్బర్‌పేట-భూంపల్లి మండల బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నగరం రవి, కోణార్క్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ రజనీఅశోక్, ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్ హైదరాబాద్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుబ్బాకను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే రఘునందన్‌రావు


గ్రామస్తులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాకను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండల పరిధిలోని ధర్మారంలో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. గ్రామంలో చేపట్టిన, చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులపై గ్రామస్తులతో ముచ్చటించారు. అనంతరం మున్నూరు కాపు సంఘం, రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మహంకాళి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేశ్‌గౌడ్, జిల్లా కార్యదర్శి భిక్షపతి, మండల అధ్యక్షుడు దేవరాజు, మండల నాయకులు వెంకట్‌గౌడ్, వెంకట్, నవీన్, గోపి, శ్రీనివాస్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన చంద్రకళ, చెప్యాల అజిత్ కుటుంబాలను పరామర్శించి సాయం అందించారు.

నిర్వాసితులకు అండగా ఉంటా

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్నసాగర్ కాల్వ నిర్మాణంలో సాగు భూమి కోల్పోయిన రైతులకు పూర్తిస్థాయి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు స్పష్టం చేశారు. మండలంలోని ఘనపురం గ్రామంలో పెద్ద చెరువు వద్ద కట్టమైసమ్మ ఆలయ నిర్మాణానికి ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భూ నిర్వాసిత రైతులతో చర్చించారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి రైతులకు త్వరగా పరిహారం అందించాలని కోరారు. కట్టమైసమ్మ ఆలయ నిర్మాణం కోసం రూ.50వేల విరాళం ఎమ్మెల్యే అందజేశారు. ఫిబ్రవరి 3 నుంచి నిర్వహించే లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు, తుక్కాపూర్ సర్పంచ్ చంద్రం, ఉప సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ శరత్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజులు డిమాండ్ చేశారు. ఆదివారం చిన్నకోడూరులో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో నియామకమైన భార్యాభర్తలకు సీనియారిటీ జాబితాలో చేర్చాలని కోరారు. పండిట్, పీఈటీలకు జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో తప్పనిసరిగా పదోన్నతుల అవకాశం కల్పించాలన్నారు. ఎస్జీటీ ఉపాధ్యాయులపై ప్రభుత్వం అవలంభిస్తున్న తీరు వివక్షతగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాల ఆవిష్కరణ


ధర్మ గ్రంథాలను ఆవిష్కరిస్తున్న సర్పంచ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి దివ్యాశీస్సులతో త్రైత సిద్ధాంత గ్రంథాలను ఆదివారం మండలంలోని తిగుల్ గ్రామంలో సర్పంచ్ భానుప్రకాశ్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అలాగే ధర్మ ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత ఆధ్యాత్మిక రంగంలో ఒక విప్లవాత్మకమైనటువంటి ప్రతీ శ్లోకమునకు శాస్త్రబద్ధం ఉందని గ్రంథం చెబుతుందని దేవేందర్ తెలిపారు. కార్యక్రమంలో శంకర్, నరేశ్, బుచ్చిబాబు, ఉపేందర్, ప్రసాద్, జశ్వంత్, సాయిరాజు, లత, ధనలక్ష్మి, లలిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను కాపాడుకోవాలి

రోటరీ గ్లోబల్ చాంపియన్ అధ్యక్షుడు నర్సింహమేథా



పాఠశాలకు బెంచీలు అందిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వ బడులను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని, బడుల బాగు కోసం మా వంతుగా ఎంతో కృషి చేస్తున్నామని రోటరీ గ్లోబల్ చాంపియన్ అధ్యక్షుడు నర్సింహమేథా అన్నారు. రోటరీ ఆధ్వర్యంలో గ్రామీణ వికాస్ ప్రాజెక్టు కింద మండలంలోని రాయవరం ప్రాథమిక పాఠశాలను సుందరంగా తీర్చిదిద్ది విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించారు. ఆదివారం బెంచీలు, టీవీ, క్రీడా పరికరాలు అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్‌ఐ కృష్ణమూర్తి, ఎంపీటీసీల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ మాట్లాడుతూ.. రోటరీ గ్లోబల్ చాంపియన్ సేవలు అమోఘమని పేర్కొన్నారు. ప్రభుత్వ బడులను కాపడుకునే బాధ్యత ప్రతీ ఒకరిపై ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పావనికనకరాజు, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు భగవాన్, ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, హెచ్‌ఎంలు శ్రీధర్‌రెడ్డి, మహబూబ్‌పాషా, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకట్‌కిరణ్, ఉపాధ్యాయులు కృష్ణ, పోచయ్య, మాజీ సర్పంచ్ గణేష్, చంద్రం, శ్రీశైలం, రాజు, గౌస్, శేఖర్, రోటరీ గ్లోబల్ ఛాంపియన్ కార్యదర్శి సోమశాస్త్రి, సభ్యులు మహిపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

‘బహుజనులపై అగ్రవర్ణాల ఆధిపత్యం’


శ్రావణికి సంఘీభావం తెలుపుతున్న పద్మశాలి సంఘ నాయకులు

హుస్నాబాద్: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ భోగ శ్రావణికి ఆదివారం హుస్నాబాద్ డివిజన్ పద్మశాలి సంఘ నాయకులు సంఘీభావం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రావణిని కొద్ది రోజులుగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పలు కారణాలతో వేధిస్తున్న నేపథ్యంలో ప్రెస్‌మీట్‌లో కంటతడి పెట్టుకొని రోధిస్తూ తన పదవికి రాజీనామా చేసిన అనంతరం తెలంగాణ పద్మశాలి సేవా సంఘం పిలుపుమేరకు శ్రావణికి మద్దతుగా ఆమె ఇంటికి వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ పద్మశాలి సేవా సంఘం నాయకులు కోమటి సత్యనారాయణ మాట్లాడుతూ.. దేశంలో బహుజనులపై అగ్రవర్ణాల ఆధిపత్యం ఇంకా కొనసాగడం సరికాదన్నారు. నిబద్ధతో పనిచేసే శ్రావణిపై రాజకీయ ఎదుగుదలను సహించలేక అనేక రకాలుగా వేధిస్తున్న స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు వెంటనే స్పందించి శ్రావణి రాజీనామాను ఆమోదించకుండా జగిత్యాల మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో కొనసాగించాలని కోరాడు. కార్యక్రమంలో పద్మశాలి సంఘ నాయకులు లక్ష్మీపతి, వెంకటనారాయణ, వెల్దండి భాస్కర్, నాగభూషణం, వెంకటేశం, వేముల రాజేశం, వడ్డెపల్లి మల్లేశం, గణపతి, నారాయణ, యాదగిరి తదితరులు ఉన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెడ్డి జాగృతి నాయకులు

దుబ్బాక: సీఎం కేసీఆర్ 2018 సంవత్సరంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పేద కుటుంబాలను ఆదుకుంటామని ఇచ్చిన మాట తప్పారని రెడ్డి జాగృతి సంఘం జిల్లా అధ్యక్షుడు దేవుడి నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం దౌల్తాబాద్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గోవిందాపూర్, గువ్వలేగి, గొడుగుపల్లి, శౌరిపూర్, గ్రామాల్లో రెడ్డి ఆత్మీయ సభ వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట పట్టణంలో ఫిబ్రవరి 5వ తేదీన జరిగే ఆత్మీయ సభకు రెడ్డి సంఘాల నాయకులు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి నాయకులు రామచంద్రారెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

గజ్వేల్‌రూరల్: పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణలో సీఎం కేసీఆర్ పాలనలో మంత్రి హరీశ్‌రావు వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తూ ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారని గజ్వేల్ ఎంపీపీ దాసరి అమరావతిశ్యామ్‌మనోహర్ పేర్కొన్నారు. గజ్వేల్‌లో ఆదివారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. వైద్యారోగ్యశాఖ మంత్రిగా హరీశ్‌రావు బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా అభినందనలు తెలుపుతున్నామన్నారు. వైద్యరంగంలో తెలంగాణ ప్రస్తుతం దేశంలోనే 3వ స్థానంలో ఉందని, త్వరలోనే మొదటి స్థానానికి చేరుకుంటుందని దీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు, సౌకర్యాలను కల్పిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా సోలిపేట సతీశ్‌రెడ్డి జన్మదిన వేడుకలు


కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దుబ్బాకటౌన్: దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి తనయుడు రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సుమారు 50 మందికి పైగా యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి సతీమని సుజాత, దుబ్బాక మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు స్వామి, దుబ్బాక బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు కృష్ణ, దుబ్బాక, దౌల్తాబాద్, చేగుంట, తొగుట మండలాల నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

సిద్దిపేటజోన్: హౌసింగ్ బోర్డ్ కాలనీలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. అంతకుముందు నాయకులు కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: సోషల్ మీడియా ద్వారా బీఆర్‌ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్ శుభం గార్డెన్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గస్థాయి సోషల్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్, రెడ్కో చైర్మన్ వై.సతీశ్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో హుస్నాబాద్ అభివృద్ధి చెందుతుందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం విద్యాహబ్‌గా మారిందన్నారు. నాడు తెలంగాణ కోసం పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, ఇప్పుడు దేశ అభివృద్ధి కోసం భారత రాష్ట్ర సమితిని కేసీఆర్ ఏర్పాటు చేశారన్నారు. ఒక వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమంతో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశంలోనే ముందుంచారని తెలిపారు. దేశంలో బీజేపీకి ప్రత్యామ్నాయం బీఆర్‌ఎస్ పార్టీ అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సోషల్ మీడియా, విద్యార్థి, యువజన విభాగాల నాయకులు పాల్గొన్నారు.

గిరిజన ప్రతిభా కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

హుస్నాబాద్‌రూరల్: తెలంగాణ గిరిజన ప్రతిభా కళాశాలలో 2023-24 సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులను స్వీకరిస్తుందని హుస్నాబాద్ గిరిజన గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి ఆదివారం తెలిపారు. వరంగల్ (బాలురు, బాలికలు)లతో పాటు హుస్నాబాద్‌లో (బాలుర) ప్రతిభా కళాశాలలు ఉన్నాయని ఇందులో చేరేందుకు ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 17వరకు ప్రవేశ పరీక్ష రాసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తుందన్నారు. ఇప్పుడు 10వ తరగతి చదివే గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష మార్చి 12న నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దిపేటరూరల్: రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర విజయవంతమైన సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పూజల హరికృష్ణ బండచెర్లపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ యువనేత రాహుల్ గాంధీ సెప్టెంబర్ 7న కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడోయాత్ర 3750 కి.మీ. విజయవంతంగా రేపటికి ముగుస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించామన్నారు. చరిత్రలోనే ఇంతవరకు ఎవరు చేయని యాత్ర రాహుల్ గాంధీ చేయటం గొప్ప విషయమన్నారు. రేపు పెద్ద ఎత్తున శ్రీనగర్‌లోని లాల్ చౌక్‌లో ఈ యాత్ర ముగింపు సభకు దేశంలో ఉన్న అన్ని ప్రాంతాల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున శ్రీనగర్‌కు చేరుకొని రాహుల్ గాంధీకి సంఘీభావం తెలియజేస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి పూజల గోపికృష్ణ, గుర్రం అంజిరెడ్డి, పుల్లూరు కనకయ్య, జిల్లా నాయకులు బండి శివకుమార్, రాజేశంగౌడ్, కోదాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..

మద్దూరు(హుస్నాబాద్): తమతో చదువుకున్న చిన్ననాటి స్నేహితుడి భార్య అనారోగ్యానికి గురికావడంతో చేయూత అందించి మానవత్వం చాటుకున్నారు స్నేహితులు. మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కొండూరి రాజు భార్య అనారోగ్యానికి గురికావడంతో 1997-98 సంవత్సరంలో తనతో 10వ తరగతి చదువుకున్న చిన్ననాటి స్నేహితులు రూ.15వేలు అందించి అండగా నిలిచారు.


ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

అర్హులకు రేషన్ కార్డులు అందించాలి

చేర్యాల(సిద్దిపేట): అర్హులైన పేదలందరికీ వెంటనే రేషన్‌కార్డులు పంపిణీ చేయాలని సీపీఐ జనగామ నియోజకవర్గ సహాయ కార్యదర్శి అందె అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని ఆకునూరులో రేషన్‌కార్డు లేని పలువురు పేదలను కలిసిన ఆయన అనంతరం మాట్లాడుతూ.. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా జారీ చేయకపోవడం అధికారులు, పాలకుల అసమర్థతకు నిదర్శనమన్నారు. దీనిపై ప్రభుత్వం పునఃరాలోచించి అర్హులైన వారికి వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సీతారామయ్య, వెంకట్, లచ్చయ్య, సారయ్య, వెంకటేశ్, కరుణాకర్, స్వరూప, సారమ్మలు పాల్గొన్నారు.

స్వదేశీ ఉత్పత్తులను బహుమతిగా ఇవ్వాలి


ప్రధాని మోదీ ప్రసంగాన్ని వింటున్న నాయకులు

హుస్నాబాద్: బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పీఎం మోదీ ఇచ్చిన సందేశాలు, సూచనలు విన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో మోదీ ప్రసంగిస్తూ కర్ణాటకకు చెందిన ఓ జంట తమలపాకుతో తయారు చేసిన అనేక ప్రత్యేకమైన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు పంపుతుందన్నారు. మన సహజ వనరులు, సంప్రదాయ నైపుణ్యాల నాణ్యత ఈ సంప్రదాయ జ్ఞానంలో ప్రపంచం స్థిరమైన భవిష్యత్ వైపు చూస్తోందన్నారు. మనం కూడా ఆదిశగా అవగాహన కలిగి ఉండి అలాంటి స్వదేశీ, స్థానిక ఉత్పత్తులను ఉపయోగించి ఇతరులకు బహుమతిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శంకర్‌బాబు, నాయకులు సతీష్, నరేశ్, తోట సమ్మయ్య, అరుణ్‌కుమార్, రాజేందర్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న రాజమణి-కుమార్ దంపతులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో నిర్మిస్తున్న ఆలయాలకు గ్రామానికి చెందిన డాకని రాజమణి-కుమార్ దంపతులు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజ్ఞాపూర్‌లో గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, నల్లపోచమ్మ ఆలయాల నిర్మాణానికి రూ. 3లక్షల 6వేల 9రూపాయల విరాళాన్ని కులపెద్దలు సాయి రాములు, ఈది దుర్గయ్యలకు అందజేశారు. ఈ సందర్భంగా దాత డాకని రాజమణి-కుమార్ దంపతులు మాట్లాడుతూ.. గ్రామంలో చేపడుతున్న గ్రామదేవతల గుడి నిర్మాణ అభివృద్ధిలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు గుండ్ర నర్సయ్య, చంద్రయ్య, లక్ష్మీనర్సయ్య, డాకని మల్లయ్య, యాదగిరి, భిక్షపతి, శ్రీనివాస్, లష్కర్ యాదగిరి, రామచంద్రం, దత్తయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.